ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నాం..

కమిషనర్ రామలింగం



ప్రజావాణిలో ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులు వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈ మాధవచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్ శ్రీసీతా రామ చంద్రస్వామి ఆలయంలో శ్రీరామకోటి స్థూపం వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌సీనగర్ ఫిషర్‌మ్యాన్ మార్కెట్ కమిటీ ఎన్నిక



కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్‌ముదిరాజ్‌తో సభ్యులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్ ఫిషర్ మ్యాన్ మార్కెట్ నూతన కమిటీని ఎన్నికల అధికారి ఎన్నిక మనోజ్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా మేడబోయిన వెంకటేశ్‌ముదిరాజ్, కార్యదర్శిగా కందుల శ్రీనివాస్‌ముదిరాజ్, కోశాధికారిగా గోవింద్‌ముదిరాజ్, సంయుక్త కార్యదర్శిగా ఆకుల కృష్ణ ముదిరాజ్, సభ్యులుగా ఆకుల కృష్ణముదిరాజ్, హన్మంతుముదిరాజ్, వెంకటరమణాముదిరాజ్, నాగేశ్‌ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాంమోహన్, శివ, రాజేశ్, రవి, వెంకటేశ్, బాలకృష్ణ, వినయ్, కృష్ణ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



వాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: బ్లూక్రాస్ సహకారంతో మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణలో భాగంగా చేపట్టిన స్టెరిలైజేషన్ ప్రోగ్రాం, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మున్సిపల్ మేనేజర్ కె.చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈ సమ్మిట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఈ సమ్మిట్–2023 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. బహుళ వ్యవస్థాపకులను ఒక్కచోట చేర్చి వారి అనుభవాలను భావి, యువ వ్యవస్థాపకులకు దిశా నిర్దేశం చేసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమ్మిట్‌తో విద్యార్థినులు విజయవంతంగా వ్యాపారం చేసేందుకు కావాల్సిన మెళకువలను నేర్చుకుంటారన్నారు.

'అనురాగ్'లో స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీ–హైదరాబాద్ ఐఈఈఈ రోబోటిక్స్ అండ్ ఆటోమిషన్ సొసైటీ, నానోటెక్నాలజీ కౌన్సిల్ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్‌ను వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ జే.సుదర్శన్, సంతోశ్ శివ సుబ్రమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి చాప్టర్ అనేది రోబోటిక్ అండ్ ఆటోమిషన్, నానోటెక్నాలజీ అనే రెండు విశిష్ట రంగాల సమ్మేళనం అన్నారు.

కూచిపూడిలో ప్రతిభచాటిన సెరినిటీ విద్యార్థులు



కీసర: నగరంలోని భారతీయ విద్యాభవన్‌లో మయూరి ఆర్ట్స్ ఫిలింస్, నృత్యశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నాగారం మున్సిపాలిటీలోని సెరినిటీ మోడల్ హైస్కూల్ విద్యార్థినులు సాయిఅనుభవి, జాహ్నవి, శ్రీవైభవి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి 10 రకాల ప్రపంచ రికార్డు పుస్తకాల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ముఖ్యకార్యదర్శి నోముల వసంత, కరస్పాండెంట్ నోముల జంగారెడ్డి అభినందించి సత్కరించారు.

గృహలక్ష్మి ఉన్నట్టా.. లేనట్టా..?

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై ఎదురుచూపులు
- బీఆర్‌ఎస్ హయాంలోని లబ్ధిదారుల్లో అయోమయం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17,090 దరఖాస్తులు
- ఎన్నికలకు ముందు మంజూరు పత్రాలు జారీ
- మాజీ మంత్రి ఏరియాలోనే 1200 మంజూరు పత్రాలు
- లబ్ధిదారుడికి రూ.3 లక్షలు ప్రకటించిన గత ప్రభుత్వం



గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి(ఫైల్)

సాక్షి, మేడ్చల్ జిల్లా: గత ప్రభుత్వం హయాంలోని గృహలక్ష్మి లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. పథకంలో లబ్ధికి గతంలో తీసుకున్న దరఖాస్తులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందా..? లేక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మళ్లీ స్వీకరిస్తారా..? అలా అయితే ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి, కొందరికి మంజూరు పత్రాలు అందజేసిన చోట ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది. అనే సందేహాలు సంబంధిత వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల చొప్పున మొదటి విడతగా మంజూరు చేస్తామని.. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించింది. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో గృహలక్ష్మిపై ఆందోళన నెలకొంది. జిల్లాలో అర్హులను గుర్తించి కొందరికి మంజూరు పత్రాలను కూడా పంపిణీ చేశారు. అయితే బీఆర్‌ఎస్ పాలనలో మొదట్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పథకం అంతగా ముందుకు సాగకపోవడంతో.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ‘గృహలక్ష్మి’ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో సొంతస్థలం ఉన్నవారికి ఇళ్ల నిర్మాణానికి విడతల వారీగా రూ.3 లక్షల నగదు ఇస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించింది. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

మేడ్చల్ జిల్లాలో 17,090 దరఖాస్తులు

సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరు చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించడంతో.. జిల్లాలో చాలామంది ప్రజలు ముందుకొచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి మూడు విడతల్లో రూ.3 లక్షల నగదు సాయం ప్రకటించింది. గడువు తక్కువగా ఉండటంతో కావాల్సిన ధ్రువపత్రాలు పొందడానికి కష్టాలు పడ్డారు. జిల్లాలో మొత్తం 17,090 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందితో సహా ఇతర సిబ్బంది పరిశీలించారు. వీటిలో కొంత మందిని అర్హులుగా తేల్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అప్పటి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వగా, మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క మేడ్చల్ నియోజకవర్గంలోనే 1200 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, మిగిలిన ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

అయోమయంలో లబ్ధిదారులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సొంతస్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ప్రకటించింది. స్థలం డాక్యుమెంట్లు కలిగిన ఉన్న వారికే మంజూరు చేస్తామని పేర్కొంది. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,000 వేల ఇళ్ల చొప్పున కేటాయించగా, మొదట్లో 500 చొప్పున 2,500 యూనిట్లు మంజూరు చేసింది. వీటిలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతం, దివ్యాంగులు 5 శాతం, మిగతావి జనరల్‌కు కేటాయించేలా ఉత్తర్వులు జారీ చేసింది. చాలామంది ప్రభుత్వం కోరిన పత్రాలను సేకరించి కలెక్టరేట్, స్థానిక ఎంపీడీవో, పురపాలక సంఘాల కార్యాలయాల్లో గంటల తరబడి నిరీక్షించి సమర్పించారు. ఇందుకు సంబంధిత పత్రాల కోసం నానా కష్టాలు పడి, క్యూలో గంటల తరబడి నిలబడి మరీ దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం కింద రూ.5 లక్షలు ప్రకటించింది. సాయం పెంపుపై అంతా హర్షిస్తున్నా.. పాత దరఖాస్తుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ పథకంలో లబ్ధి చేకూరుస్తారా..? లేక తిరిగి దరఖాస్తులు తీసుకుంటారా..? ఈ విషయమై మళ్లీ ప్రక్రియ మొదలుపెట్టి పూర్తయ్యే వరకు ఎంతకాలం అవుతుందోననే ఆందోళన ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మేడ్చల్: గత ప్రభుత్వంలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని ఘట్‌కేసర్, శామీర్‌పేట, కీసర మండలాల్లో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉదయం 9.30 గంటలకు శామీర్‌పేట్ 10గంటల కీసరలో నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. 10.30గంటలకు ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, 11 గంటలకు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

పోలింగ్ స్టేషన్లను మార్చాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న మోహన్‌రెడ్డి

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ స్టేషన్లను మార్చాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన నియోజకవర్గ ఆర్‌ఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి అన్నారు. లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ద్వారా 180 దరఖాస్తులను జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఆయన స్వీకరించారు. భూసంబంధిత సమస్యలతో పాటు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం, పింఛన్లతో పాటు వ్యక్తిగత సమస్యలపై పలువురు ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా రవిప్రకాష్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి బి.రవి ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ప్రతినిధులు నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, నాయకులు ఈశ్వర్, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామినేని శ్రీనివాస్, శశికాంత్‌రెడ్డి, కె.లక్ష్మణ్, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్ పాల్గొన్నారు. నూతన కార్యవర్గంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శిగా బి.భరత్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శామ్యూల్‌పాల్, ఉపాధ్యక్షులుగా రవిచంద్ర, హరి, వి.శ్రీదేవి, జాయింట్ సెక్రటరీలుగా చంద్, నాగరాజు, రజిని, పారిజాతం, కార్యాలయ కార్యదర్శిగా పద్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేష్, ప్రచార కార్యదర్శిగా కొండల్‌రావు, కార్యనిర్వాహక సభ్యులుగా అనిల్ కుమార్, కె.కార్తీక్, సజీద్ అత్తారి, అన్నపూర్ణ ఎన్నికయ్యారు.

సీఎంఆర్‌లో హరితహారం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో సోమవారం హరితహారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ నాగరాజు నాయక్, అధ్యాపకులు రోహిణిరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయశాంతి, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పాలకవర్గంతో చర్చ



మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై పాలకవర్గంతో చర్చించినట్లు చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్, ఎల్‌ఎన్ కాలనీలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను బహిరంగ వేలం ద్వారా అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. 23న జరిగే వైకుంఠ ఏకాదశికి చేయాల్సిన ఏర్పాట్లు, కొత్త ట్రాక్టర్, స్వచ్ఛ ఆటో కొనుగోలు వంటి అంశాలపై చర్చ జరిగిందన్నారు. అన్ని వార్డుల్లో కౌన్సిల్ సభ్యుల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు బాలగోని వెంకటేశ్ గౌడ్, హరిప్రసాదరావు, సుర్వి సుధాలక్ష్మి, నల్లవెల్లి లక్ష్మి, ఆకిటి శైలజ, బైర హిమ, పోచమ్మ, సుధాలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, అక్రమ్ అలీ, ఏఈ నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పూజ



స్వామివారి అభిషేక పూజ

కీసర: కీసరలో కొత్తగా నిర్మించిన శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మొదటిసారి కీసర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామికి పదునెట్టబడి పూజను కన్నులపండువగా నిర్వహించారు. కేరళ నుంచి ప్రత్యేకంగా రప్పించిన నంబూద్రి పూజారి చేతుల మీదుగా పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయానికి ముందున్న 18 మెట్లను పూలు, పండ్లతో అందంగా అలంకరించారు. అభిషేక ప్రియుడైన అయ్యప్పకు పంచామృత అభిషేకాలు నిర్వహించి అందంగా ముస్తాబు చేశారు. కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్, ఉపసర్పంచ్ లక్ష్మణ్, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు బెలిదే రమేష్‌గుప్తా, మచ్చాని జంగయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావన్‌కుమార్‌గుప్తా, గురుస్వాములు నల్లబాల్‌రెడ్డి, బొడుసు రమేష్‌యాదవ్, మొర్గు యాదగిరి, అయ్యప్ప దీక్షదారులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనిధిలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

పోచారం: యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళ, బుధవారాల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 గ్రాండ్ ఫినాలే జరగనున్నట్లు నిర్వాహకులు డా.శృతి భార్గవ చౌబే తెలిపారు. దేశంలోని 46 నోడల్ సెంటర్లలో శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల ఉందన్నారు. విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభ కనబర్చేందుకు హ్యాకథాన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు, 60 మందికి పైగా మార్గదర్శకులు(మెంటర్స్) పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు ప్రేక్షకులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు విచ్చేయనున్నట్లు చెప్పారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



కీసర: కీసర గ్రామ ప్రజలకు కష్టకాలంలో తాను అండగా నిలుస్తానని కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కీసరలో అనారోగ్యకారణంగా మృతిచెందిన పర్వత మైసమ్మ మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం మృతురాలి కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజాదర్బార్‌లో ఆరు ఫిర్యాదులు



మేడ్చల్ ప్రజాదర్బార్‌లో అధికారులు

మేడ్చల్: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌ను అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొనగా ప్రజల నుంచి ఆరు అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కరించాని సంబంధిత శాఖలకు పంపినట్లు ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. దర్బార్‌లో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఏఓ అర్చన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో సీఎన్జీ సరఫరా ప్రారంభం



శామీర్‌పేటలో సీఎన్జీ గ్యాస్ సరఫరాను ప్రారంభిస్తున్న సర్పంచ్ బాలమణి

శామీర్‌పేట్: శామీర్‌పేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని సర్పంచ్ విలాసాగరం బాలమణి అన్నారు. మండలకేంద్రమైన శామీర్‌పేటలో ఇంటింటికీ సీఎన్జీ గ్యాస్ సరఫరాను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, సీఎన్జీ గ్యాస్ కంపెనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈసీలో వర్క్‌షాప్ ప్రారంభం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం వర్క్‌షాప్ ప్రారంభమైంది. సీఎస్ఐఆర్ సహకారంతో సొసైటల్ అప్లికేషన్ ఆఫ్ ఏఐ అండ్ ఎంఎల్ ఇన్ సివిల్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో వాల్యూలాడెన్ సంస్థ సీఈఓ లావణ్య, కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ రాము పాల్గొని మాట్లాడుతూ సివిల్, మెకానికల్ విభాగంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌లు ఎంతో కీలక పాత్రలు పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు వర్క్‌షాప్‌ల ద్వారా అధునాతన విజ్ఞానాన్ని అభ్యసించగలుగుతారని, విద్యార్థులను సాంకేతికత వైపు మరింత ముందుకు నడిపించగలరని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహరెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్‌లు సుజీత్, రామసుబ్బారెడ్డి, కన్వీనర్ దిలీప్‌రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవీ..?



అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ప్రశ్నించారు. మంగళవారం మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో అక్రమ భవనాల ఫొటోలను చూపిస్తూ విలేకరులతో మాట్లాడారు. అన్నోజిగూడలోని ప్రభుత్వ భూమి 3/1 సర్వే నంబర్‌లో ఇళ్లు నిర్మించి అక్రమంగా అమ్ముకుంటుంటే ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోందన్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో లెక్కకు మించిన నిర్మాణాలు అక్రమంగా వెలుస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. శ్రీనిధి కళాశాలలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసి ఆరు నెలలైనా స్పందన కరువైందన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి



ఘట్‌కేసర్‌లో వినతి స్వీకరిస్తున్న ఎంపీడీఓ నందకిశోర్

ఘట్‌కేసర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతివారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహిస్తామని ఎంపీడీఓ నందకిశోర్ అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఏడు వినతులు స్వీకరించామన్నారు. ఇంటి అనుమతుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల వ్యయానికి వినియోగించేందుకు అవకాశం ఇవ్వాలని, మండల కేంద్రంలో సదరమ్ క్యాంపు ఏర్పాటు చేయాలని, మొక్కలకు నీటిని సరఫరా ట్యాంకర్ల బిల్లులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చెల్లింపులకు అనుమతి ఇవ్వాలని అవుషాపూర్ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి అందజేశారు.

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



నాడెం చెరువు వద్ద మాట్లాడుతున్న ఏఈ పరమేశ్

ఘట్‌కేసర్: వెంకటాపూర్ నాడెం చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మిస్తున్న పలు నిర్మాణాలను ఇరిగేషన్ ఏఈ పరమేశ్, కార్యదర్శి లింగారెడ్డితో కలిసి సోమవారం పరిశీలించి పనులు నిలిపివేయించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ నుంచి అనుమతులున్న ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. భూమి సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు ఏఈని కోరారు.